క్లుప్తంగా

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



కొత్తకోట రూరల్: కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేఎస్ రత్నం ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భీమన్న నాయుడు పూలమాల, శాలువాతో సత్కరించారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో లాల్‌కోట రవి, విష్ణు ఉన్నారు

ప్రత్యేకాధికారికి సన్మానం



పెబ్బేరు రూరల్: మండలంలోని సూగూరు పంచాయతీకి నియమించిన ప్రత్యేకాధికారి చంద్రమౌళి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చంద్రమౌళికి మాజీ సర్పంచ్ వెంకటస్వామి బాధ్యతలు అప్పగించడంతో పాటు గ్రామస్తులతో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్యాంగౌడ్, ఆంజనేయులు, నరసింహ, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌కు..



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగూడెం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు యాదమ్మ, సాయిలత, రజిత, మాధవి, జితేందర్‌తో కలిసి సర్పంచ్ కొండన్న, ఉప సర్పంచ్ భాస్కర్‌గౌడ్‌ను సన్మానించారు.

పూజారికి..



పెబ్బేరు రూరల్: పట్టణంలోని సాయిబాబా ఆలయంలో పూజారిగా పనిచేస్తున్న నవీన్‌కు మార్‌శర్మ అయోధ్యలో జరిగిన బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠానంతరం జరుగుతున్న మండల పూజ, హోమంలో పాల్గొన్నారు. రాముడి సేవలో పాల్గొని పట్టణానికి చేరుకున్న అతడికి షిరిడిసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు

విద్యార్థులకు రక్త పరీక్షలు



పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో శుక్రవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఐరన్ ఫోలిక్, విటమిన్ సీ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. దీంతో పాటు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, డా.హరీష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామయ్య, వైద్య సిబ్బంది రాంచందర్, సతీష్, నాగేశ్వరీ, ఆశా కార్యకర్తలు రేణుక, కవిత, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్, లోగో ఆవిష్కరణ



కొత్తకోట రూరల్: యువశక్తి ఫౌండేషన్ నూతన సంవత్సర క్యాలెండర్, లోగోను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా యువశక్తి ఫౌండేషన్ వారు చేస్తున్న సేవలను నిత్యం తను మీడియాలో చూస్తున్నానని, వారి సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు, రాష్ట్ర అధ్యక్షుడు గొబ్బురు నవీన్, చైర్మన్ సాయితేజ, గణేష్, శివకృష్ణ, చందు, ఆంజనేయులు, రామస్వామి, సాయి, హరీష్, కుర్మయ్య తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

అమరచింత: పట్టణానికి చెందిన ఎలక్ట్రీషియన్ జిలాని వారం రోజుల కిందట పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను తిరిగి బాధితుడికి అందించామని ఏఎస్‌ఐ జమీరుద్దీన్ తెలిపారు. జిలానికి చెందిన సెల్‌ఫోన్ పట్టణంలోని ప్రధాన రహదారిపై బైక్ ప్రయాణిస్తుండగా పడిపోయిందన్నారు. విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా తమ సిబ్బంది అరవింద్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకొని తిరిగి బాధితుడికి అందించడంలో కృషి చేశాడన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్‌పవార్, హాజరైన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్తకోట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే పుర అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ తేజస్ పవార్ అన్నారు. శుక్రవారం పుర చైర్‌పర్సన్ పి.సుఖేశిని అధ్యక్షతన జరిగిన 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సమావేశానికి ఆయనతో పాటు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ ఏడాది పుర బడ్జెట్ రూ.9.13 కోట్ల అంచనాతో కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పుర అధికారులు, సిబ్బంది సకాలంలో పన్నులు వసూలు చేసి ఆదాయం పెంపుపై దృష్టి సారించాలన్నారు. బాధ్యతాయుతంగా, ప్రజలకు జవాబుదారీగా ఉండేలా పనిచేయాలని సూచించారు. పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని, పారిశుద్ధ్య పనులు సకాలంలో పూర్తి చేయాలని కమిషనర్‌కు సూచించారు. మదనాపురం రహదారి విస్తరణ పనుల ప్రక్రియను ప్రారంభించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌ను కోరారు. ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ, డిజిటలైజేషన్‌కు సహకరించిన అధికారుల ందరికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పుర పరిధిలోని సమస్యలను వేగవంతంగా, దశల వారీగా పరిష్కరించాలని కోరారు.

అందరి సహకారంతోనే..

అందరి సహకారంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి జలాశయం నుంచి నీటి విడుదలకు అనుమతించిన కలెక్టర్ తేజస్ పవార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు నిర్మాణం రెవెన్యూ అధికారుల సహకారంతో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే కొత్తకోటలోని 30 పడకల ఆస్పత్రిని 50 పడకలకు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. విద్యుత్ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని నిరంతరం సరఫరా చేస్తామని తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి అధికారులతో చర్చించి ముందుకెళ్తామన్నారు. నిలిచిన రహదారి విస్తరణ పనులు పునః ప్రారంభించాలని, పట్టణాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. పట్టణంలో ఉర్దూ కళాశాల ఏర్పాటుకు మంత్రితో చర్చించామన్నారు. సమావేశంలో పుర కమిషనర్ శ్రీనివాసులు, వైస్ చైర్‌పర్సన్ జయమ్మ, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పుర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలి

- ఇన్‌చార్జ్ డీఈఓ గోవిందరాజులు



ఖిల్లాఘనపురంలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ గోవిందరాజులు

ఖిల్లాఘనపురం: పదోతరగతి విద్యార్థులను చదువుతో పాటు మానసికంగా వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి గోవిందరాజులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం, భవిత కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట కార్మికులకు పలు సూచనలు చేశారు. ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలపై ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పదోతరగతిలో విద్యాపరంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, చదువుపై ఆసక్తి కలిగేలా చూడాలన్నారు. రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు రోజు విధిగా పాఠశాలకు వచ్చేలా ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు. తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ప్రగతిపై చర్చించాలని కోరారు. కేజీబీవీలో అమలు చేస్తున్న మెనూను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రానికి వచ్చే ప్రత్యేక అవసరాల చిన్నారులపై జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్రం ఉపాధ్యాయులకు సూచించారు. ఎమ్మార్సీ వద్ద డీఈఓను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

వనపర్తి: ఎంపిక చేసిన వసతిగృహాల్లో పదోతరగతి విద్యార్థులకు ట్యూటర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహించి వందశాతం ఉత్తర్ణత సాధించాలని బీసీడీఓ బి.సుబ్బారెడ్డి సూచించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయా వసతిగృహ వార్డెన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టళ్లలో ఉండి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాల్సి ఉందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకోవాలని.. వారి సందేహాలను నివృత్తి చేయాలని, పరీక్షలంటే భయం పోగొట్టాలని సూచించారు. వార్డెన్లు ఎస్.ఆంజనేయులు, బీజీ అమృతసాగర్, మాధవి, శివయ్య, కుమారస్వామి, రమేష్‌గౌడ్, జీవిత, విజయ, కురుమూర్తి, నరేష్, ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ శిబిరం ఏర్పాటు



ఫిజియోథెరఫీ క్యాంపును పరిశీలిస్తున్న ఎంఈఓ

పాన్‌గల్: ప్రత్యేక అవసరాల పిల్లల కోసం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించే ఫిజియోథెరపి క్యాంపులను ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించే క్యాంపును ఎంఈఓ పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలల్లో ఉండే ప్రత్యేక అవసరాల పిల్లల కోసం విద్యాశాఖ తరఫున క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫిజియోథెరపి డాక్టర్ బాలకృష్ణ పిల్లలకు పరీక్షలు నిర్వహించి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు సంతోష్, కేశవులు, సీఆర్పీలు గోవింద్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ విడుదల

ఆత్మకూర్: పట్టణంలో ప్రముఖ వాక్యోపదేశకులు, దైవానుజులు పాల్‌కిషోర్ ఆధ్వర్యంలో ఈనెల 7, 8, 9 వ తేదీల్లో మూడురోజుల పాటు నిర్వహించనున్న యేసుప్రభు నామధ్యాన మహోత్సవానికి క్రైస్తవులు అధికసంఖ్యలో హాజరుకావాలని పాస్టర్ విద్యాసాగర్ కోరారు. ఈసందర్భంగా మూలమళ్ల చర్చిలో మహోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి

పాన్‌గల్: మండలంలోని బండపల్లికి చెందిన పెరుమాల్ల నాగరాజు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా నియమించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీలో ఈ నియామకం జరిగినట్లు శుక్రవారం ఆయన పేర్కొన్నారు. తనపై ఎంతో నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా నియమించడంపై ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ వాసి ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శిగా నియమించడంపై ఐక్య వాల్మీకి పోరాట సమితి, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు రఘుపతినాయుడు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

సైన్స్‌ఫెయిర్‌లో జగత్‌పల్లి విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని భువనేశ్వరిని అభినందిస్తున్న ఏపీ సమగ్ర శిక్షణ అభియాన్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1వరకు నిర్వహించిన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో దేశంలోని కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, పుడిచేరి రాష్ట్రాల్లోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 500మంది విద్యార్థులు పాల్గొని 185 ఎగ్జిబ్యూట్లను ప్రదర్శించారు. అందులో పెద్దమందడి మండలం జగత్‌పల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని ముంత భువనేశ్వరి అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. దీంతో గైడ్ టీచర్ జ్యోతిర్మయి, విద్యార్థి భువనేశ్వరికి ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షణ అభియాన్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజికల్ మ్యూజియం ప్రొఫెసర్ జ్యోతి అప్రిసియేషన్ బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేసినట్లు హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని భువనేశ్వరిని, గైడ్ టీచర్ జ్యోతిర్మయిని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

ఎమ్మెల్యేకు వినతి

కొత్తకోట: గత ప్రభుత్వం పట్టణ కేంద్రానికి చెందిన ముస్లిం మైనార్టీల సంక్షేమానికి విడుదల చేసిన నిధులను వెనక్కి పంపకుండా టెండర్లు పూర్తై అగ్రిమెంట్ అయిన పనులను వెంటనే పూర్తి చేయాలని శుక్రవారం స్థానిక మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు మైనార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఖాజా, వసీంఖాన్ తదితరులు ఉన్నారు.

వేతన సవరణ జీఓ 21ని అమలు చేయాలి

పెబ్బేరు రూరల్: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వమైన వేతన సవరణ జీఓ 21ని అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి సురేష్ కోరారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల వద్ద శానిటేషన్, సెక్యూరిటీ, కార్మికుల విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల బ్రాంచ్ ఏఐటీయూసీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వరుణ్, ఉపాధ్యక్షులు మద్దిలేటి, సుజాత, ప్రధాన కార్యదర్శి సైదాబేగం, సహాయకార్యదర్శులుగా మధు, భారతి, కోశాధికారులు లక్ష్మి, కుమార్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శివాజీ, ఎంఏ ఫరూక్, సాయిరాం, శేఖర్, నారమ్మ, బుజ్జమ్మ, చెన్నమ్మ, వీరమ్మ, శోభ, లక్ష్మి, మన్నెమ్మ, రాజేశ్వరి, అంజనమ్మ ఉన్నారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ



ఆత్మకూర్: స్థానిక సీఐగా శివకుమార్ శుక్రవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కేఎస్ రత్నం కొత్తకోట సీఐగా బదిలీపై వెళ్లారు. గద్వాల జిల్లా డీసీఆర్బీలో విధులు నిర్వహిస్తున్న శివకుమార్ బదిలీపై ఆత్మకూర్‌కు వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ నరేందర్, పోలీసులు సీఐకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఆత్మకూర్, అమరచింత, మదనాపూర్ మండలాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలు సహకరించాలని సీఐ శివకుమార్ కోరారు.

ఉపాధిహామీతోనే పేదలకు మేలు



అనకాయిపల్లి శివారులో ఉపాధి హామీల కూలీలతో కేక్ కట్ చేయిస్తున్న ఎంపీడీఓ అఫ్జల్

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని అంకాయపల్లిలో జాతీయ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ వేడుకలను ఎంపీడీఓ అఫ్జల్, కూలీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కూలీలతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా కూలీలకే కాకుండా రైతులకు సైతం మేలు జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పనులు లేనప్పుడు కూలీ పనులకు గ్రామాలను వదిలి పట్టణాలకు వెళ్లే వారని, ఈ పథకం రావడంతో అన్ని వర్గాల కూలీలకు మేలు జరుతుందన్నారు.

అమడబాకులలో..

జాతీయ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కూలీలు, అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, ఫీల్డ్ అసిస్టెంట్ లలిత కూలీలతో కలిసి గ్రామ సమీపంలో మొక్కలు నాటారు. అనంతరం కూలీలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం రావడంతో గ్రామాల్లోని నిరుపేద కూలీలకు చేతినిండా పని లభిస్తుందన్నారు. కూలీ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారికి ఈ పథకం ద్వారా గ్రామంలోనే కూలీ పనులు దొరుగుతున్నాయన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్, ఎంపీఓ రాజు, ఏపీఓ గట్టయ్య కూలీలతో కలిసి కేకు కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చెట్లకు నీళ్లు పోశారు. కార్యక్రమంలో రైతు కమిటీ అధ్యక్షుడు రాములు, విష్ణు, గోవిందు, రామరాజు, తిరుపతయ్య, ఉపాది కూలీలు, రైతులు పాల్గొ న్నారు.


గోపాల్‌పేట: ఉపాధి హామీ పనులతో పేదలకు గ్రామాల్లోనే జీవనోపాధి దొరుకుతుందని ఎంపీడీఓ ఉసేనప్ప అన్నారు. మండల కేంద్రంలోని నర్సరీలో ఉపాధిహామీ కూలీలతో కలిసి అధికారులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ నరేందర్, పీఆర్ ఏఈ భాస్కర్, మాజీ సర్పంచ్ రమేష్, ఫీల్డ్‌అసిస్టెంట్ రాములు, సుదర్శన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, కూలీల సమక్షంలో పనులు జరిగే ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ రఘురాములు, ఏపీఓ కుర్మయ్య, పంచాయతీ ప్రత్యేకాధికారులు లక్ష్మణ్‌నాయక్, లక్ష్మీకుమార్, డా.శ్యాం, విద్యాసాగర్‌రెడ్డి, ఈసీ అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని రుక్కన్నపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఎంఈఓ ఉషారాణి, ఎంపీఓ రాజు పాల్గొన్నారు

సమ్మె జయప్రదం చేద్దాం

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వ కార్పొరేటు, మతతత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్ బంధు జయప్రదం చేయాలని శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ 2024 ఎన్నికలల్లో బీజేపిని ఓడించి కార్మికుల హక్కులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజు, పరమేశ్వరాచారి, మేకల ఆంజనేయులు, రమేష్, బొబ్బిలి నిక్సన్,శారద ,బాబు సాగర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేత



పెబ్బేరు రూరల్: మండలంలోని కంచిరావుపల్లికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త కావలి రాజు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. అతడికి బీఆర్‌ఎస్ సభ్యత్వం ఉండడంతో రూ.2 లక్షల ప్రమాద బీమాతో పాటు రూ.5 లక్షల రైతు బీమా చెక్కు మంజూరయ్యాయి. శుక్రవారం వనపర్తిలో తన నివాసంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి బీమా చెక్కు మృతుడి భార్య కావలి సుజాతకు అందజేశారు.

నులిపురుగులను నివారిద్దాం

వీపనగండ్ల: సమన్వయంతో పనిచేసి అవసరమైన చర్యలు తీసుకున్నప్పుడే నులి పురుగులను పూర్తి స్థాయిలో నివారించవచ్చని మండల వైద్యాధికారి వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో డీ వార్మింగ్ డే సందర్భాన్ని పురస్కరించుకుని ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. చిన్నారుల వయస్సును పట్టి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన తేదీల ప్రకారం అన్ని కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లోనూ ఈ నివారణ మందులు పంపిణీ చేయాలని ఆయన కోరారు.

సందిగ్ధంలో అవిశ్వాసం

- ఈ నెల 7 తర్వాత సమావేశం అవుదామన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- ఆర్థిక చేయూతనిచ్చేందుకు చైర్మన్ రాయభారం

వనపర్తి టౌన్: మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం అంశం సందిగ్ధంలో పడింది. వాస్తవానికి గురువారమే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కౌన్సిలర్లతో సమావేశమై అవిశ్వాస తీర్మానం దిశగా నిర్ణయం వెలువడుతుందని ప్రచారం జరిగింది. కానీ మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమానికి నిరంజన్‌రెడ్డి వెళ్లడంతో శుక్రవారం సమావేశం నిర్వహించాలనుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ కాకుండా 21 మంది సభ్యుల బలమున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్ అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లు బీఆర్‌ఎస్ కార్యాలయానికి బయలుదేరారని విస్తృతంగా ప్రచారం సాగింది. అసమ్మతి గళం వినిపించే కౌన్సిలర్లు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలవడంతో ప్రస్తుతానికి తన షెడ్యూల్ బిజీగా ఉందని, ఈ నెల 7 తర్వాత సమావేశం అవుదామని చెప్పినట్లుగా సమాచారం. వీరిని శాంతపరిచేందుకు చైర్మన్ గట్టుయాదవ్ ప్రయత్నాలు చేపట్టినట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది. ఈ నెల 7 తర్వాత మెజార్టీ కౌన్సిలర్ల అభిప్రాయాలు వినేందుకు మాజీ మంత్రి సమయం ఇవ్వకుంటే నేరుగా నోటీస్‌లు ఇచ్చి అవిశ్వాసం ప్రక్రియను చేపట్టాలని అసమ్మతి వర్గం కౌన్సిలర్లు భావిస్తున్నారని వినికిడి. మరో వారంలోపు అవిశ్వాస తీర్మాణ అంశంపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని మెజార్టీ కౌన్సిలర్లు అభిప్రాయపడుతుండగా, కొందరు కౌన్సిలర్లు మాత్రం తీర్మాణం పెట్టేవరకు నమ్మకం లేదని చర్చించుకుంటున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాములు పేర్కొన్నారు. మండలంలోని 28 పంచాయతీలకు కేటాయించిన ప్రత్యేకాధికారులు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకొని వారికి కేటాయించిన గ్రామాలకు చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులతో కలిసి పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జీపీ ప్రత్యేకాధికారులు లక్ష్మణ్‌నాయక్, లక్ష్మీకుమార్, విద్యాసాగర్‌రెడ్డి, డా.శ్యామ్, అశోక్‌నాయుడు, వెంకటేష్, సాజీద్‌రహమన్ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: కొత్తకోటలోని 22 గ్రామాలకు 9మంది ప్రత్యేకాధికారులను కేటాయించారు. పలువురు అధికారులు తమకు కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఆయా గ్రామాల సర్పంచ్‌ల నుంచి చార్జ్ తీసుకుని బాధ్యతలు చేపట్టారు. మండలంలోని అమడబాకులలో పంచాయతీరాజ్ ఈఏ ఎస్‌కే షబ్బీర్ హుస్సేన్ సర్పంచ్ బుచ్చన్న నుంచి చార్జ్ తీసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడదాం



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు



మదనాపురంలో మాట్లాడుతున్న జబ్బార్

మదనాపురం: కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడదామని సీపీఎం వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం ఆ పార్టీ మండల నాయకుడు చీర్ల ప్రసాద్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు కల్పించకుండా, కార్మికులపై వివక్ష చూపుతూ దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. దేశ అభివృద్ధి, ఔనత్యం కోసం ఈ నెల 16వ తేదీన జరిగే గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మండల కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు విష్ణు, వెంకటేష్, చిరంజీవి, నాగరాజు, వార్డు సభ్యులు కోటకొండ చెన్నయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మె నోటీస్

పెబ్బేరు రూరల్: డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేస్తున్న సమ్మెకు సంబంధించి నోటీసును వనపర్తి డీడబ్ల్యూఓ రామమహేశ్వర్‌రెడ్డి, సీడీపీఓ కార్యాలయంలో సూపర్‌వైజర్ జ్యోతికి అందించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా నాయకులతో కలిసి దేశవ్యాప్త సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ఈ సమ్మెలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, తెలంగాణ టీచర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద, నారాయణమ్మ, జ్యోతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్, రమేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

రేవల్లిలో ఉపాధిహామీ రికార్డుల తనిఖీ

గోపాల్‌పేట: ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టే పనుల్లో చేసిన పనులకు, కూలీలకు చెల్లింపుల్లో తేడాలు రాకూడదని, అలా చేస్తే అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ సయ్యద్ సుల్తాన్ అన్నారు. శుక్రవారం రేవల్లి మండల కేంద్రంలో ఎంపీడీఓ సుజాత సమక్షంలో ఉపాధిహామీ సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈసందర్భంగా అడిషనల్ డీఆర్‌డీఓ గతేడాది మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా నిర్వహించిన రూ.1.58 కోట్లకు సంబంధించిన పనుల రికార్డులు తనిఖీ చేశారు. ఈ ఏడాది రికవరీ రూ.13,024 వచ్చిందని చెప్పారు. దీనికి తోడు రూ.4,500 జరిమానా కట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు వీరాంజనేయులు, రహీం, అంజన్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాదర్ ఊరేగింపు



అమరచింత: పట్టణంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో అజ్మీర్ దర్గా షరీఫ్ చాదర్ ఊరేగింపు కార్యక్రమాన్ని మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై చాదర్‌ను ఎత్తుకుని ర్యాలీలో పాల్గొన్నారు. అజ్మీర్ దర్గాకు చాదర్‌ను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని మజిద్ కమిటీ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ తెలిపారు. కార్యక్రమంలో ఖాజాహుస్సేన్, ఖాసీం, తౌఫిక్, ఆబీద్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.